



ఫెడరల్ బ్యాంక్ నూతన బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు :స్థానిక వేదాయపాళెం ప్రాంతంలో ఫెడరల్ బ్యాంక్ రెండో నూత బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఫెడరల్ బ్యాంక్ డిప్యూటీ వైస్ ప్రసిడెంట్ స్వాత్రి ప్రియ మాట్లాడుతూ 1913 నుంచి దేశంలో తమ బ్యాంక్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 39 బ్రాంచ్‌లు కలిగి ఉన్నామన్నారు. తిరుపతి క్లస్టర్ పరిధిలో 14వ బ్రాంచ్, నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో మొదటి బ్రాంచ్‌లో జిల్లా వాసులకు సేవలం దిస్తున్నా మన్నారు. నగరం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఫెడరల్ బ్యాంకు సేవలు ఖాతాదారులకు మరింత చేరువ చేయాలన్న ఆలోచనతో వేదాయపాళెం ప్రాంతంలో రెండవ బ్రాంచ్ ఏర్పాటు చేసుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. ముఖ్యఅతిధులుగా కె.శ్రీనివాసులు,కె.సుమతి, కోట సూర్యనారాయణ హాజరయ్యారు.



మాట్లాడుతున్న బ్యాంక్ అధికారులు


'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కిటకిట..


కార్పొరేషన్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-నెల్లూరు :కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు అంగీకరిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో సుమారుగా 90 రోజుల పాటు 'స్పందన' కార్యక్రమం తాత్కాలికంగా ఆగిపోయింది. ఎన్నికల ప్రక్రియ ముగియడం, టిడిపి ప్రభుత్వం రావడంతో 'స్పందన' కార్యక్రమం పేరును 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' మార్పు చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ ఎం హరి నారాయణన్ నిర్వహించారు. మొదటి రోజే ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేశారు. జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి విచ్చేసిన ప్రజల నుంచి వినతి పత్రాలను కలెక్టర్ హరి నారాయణన్, జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, డిఆర్ఓ లవన్న, జెడ్‌పి సిఇఒ కన్నమ నాయుడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేసి త్వరగా పరిష్క రించాలనీ ఆదేశించారు. డిఆర్డిఎ పిడి సాంబశివారెడ్డి, డిపిఓ సుస్మిత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరేడ్ మైదానంలో..నగరంలోని పోలీసు పేరెడ్ మైదానంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)' కార్యక్రమంలో బాధితులు తమ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ వినతులు వెల్లువెత్తాయి. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్‌పి కె.ఆరీఫ్ హఫీజ్ పాల్గొని జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన బాదితుల సమస్యలను ఆలకించి కొన్ని సమస్యలకు పరిష్కారం చూపించారు. మరికొన్ని సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఆయా విభాగాల అధికారులకు అందజేసి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. బాదితుల నుంచి102 ఫిర్యాదులు స్వీకరించారు. అడిషనల్ యస్.పి. (క్రైమ్స్) , సిసిఎస్ ఉమెన్ పోలీస్ స్టేషన్ డిఎస్‌పి, ఎస్‌బి సిఐ, వెల్ఫేర్ ఆర్ఐ, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.




కందుకూరులో..

నెల్లూరు సిటీ :రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ వికాస్ మర్మత్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల అనంతరం తొలిసారిగా ప్రజా వేదికను నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాధుల కార్యక్రమం ద్వారా ఐదు అర్జీలు వచినట్లు మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎం చంద్రమోహన్ తెలిపారు. ప్రతి సోమవారం కందుకూరు పురపాలక సంఘం కార్యాలయము కమీషనర్ వారి ఛాంబర్ నందు జరుగు ప్రజా పిర్యాధుల కార్యక్రమమును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమస్యలు ఏవైనా ఉంటే :91777 00267 నెంబర్‌కు తెలియజేయవచ్చాన్నారు.

'ఫోర్జరీ'లో వైసిపి నేతల పాత్రపై ఆరా..!

◆ఇప్పటికే నలుగురు అధికారులు సస్పెన్షన్
◆ఓ ప్రయివేటు వ్యక్తి కీలక పాత్ర
◆విజిలెన్స్ డిజికి నివేదిక
◆గతాన్ని తవ్వుతోన్న అధికారులు

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసి సుమారు రూ.15 కోట్ల మేర అవినీతికి పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్న అధికారులు విచారణ వేగవంతం చేశారు. విజిలెన్స్ అధికారులు డిజికి నివేదిక పంపారు. ఇప్పటికే కొంత దర్యాప్తు నిర్వహించిన అధికారులు మరింత లోతుగా దర్యాప్తునకు ఉన్నతాధికారులను నివేదిక పంపారు. ఇప్పటికే నలుగురు కార్పొరేషన్ అధికారులపై సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత కమిషనర్ నుంచే జరిగిందా. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సాగిందా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అందుకు అనుగుణంగా విజిలెన్స్ అదికారుల దర్యాప్తు చేస్తున్నారు. సుమారు 114 ఫైల్‌పై సంతకాలు ఉన్నట్లు చెబుతుండగా ఇది మరింత ఎక్కువే ఉంటాయని చెబుతున్నారు. గతంలో పనిచేసిన అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పుడు వైసిపి నేతల పాత్రపై చర్చసాగుతోంది. ఓ ప్రయివేటు వ్యక్తి కీలకంగా వ్యవహరించారని సమాచారం.

ప్రజాశక్తి-నెల్లూరుప్రతినిధి

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రభుత్వానికి చేరాల్సిన నగదును కొందరు వైసిపి నేతలు అప్పనంగా కాజేశారని తెలుస్తోంది. దీనికి నలుగురు కార్పొరేషన్ అధికారులను బాధ్యులను చేస్తూ కమిషనర్ సస్పెండ్ వేటు వేశారు. కింద స్థాయి అధికారులు ఐఎఎస్ అధికారి సంతకం ఫోర్జరీ చేసే అంత సాహసం చేస్తారా ? వీరి వెనుక ఎవరు ఉన్నారు? అప్పటి అధికార వైసిపి నేతల పాత్ర ఎంత? ఎవరెవరు ఎంత మింగేశారు? అంటూ అనేక రకాల చర్చలు సాగుతున్నాయి. అసలు ఇది ఎప్పటి నుంచి ప్రారంభమైందనే నుంచి దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.ఓ లెక్క ప్రకారం 114 ఫైళ్లు కదలినట్లు విశ్వసనీయ సమాచారం. విచారణ జరిగితే సుమారు 200 ఫైళ్లు వరకు ఫోర్జరీ జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే విజిలెన్స్ అధికారులకు విచారణ కోసం ఆదేశించారు. విజిలెన్స్ అధికారులు ప్రాథమిక విచారణ పూర్తి చేసినట్లు విశ్వసనీయ సమాచారం. తదిపరి విచారణ కోసం విజిలెన్స్ డిజికి ఇక్కడ అధికారులు నివేదిక పంపారు. అక్కడ అధికారి బాధ్యతలు తీసుకున్న వెంటనే మరింత లోతుగా విచారణ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ అధికారులు ఏం జరిగిందనే విషయమై విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఎక్కడైనా ప్రతిపక్షం ఉంటే ప్రశ్నిస్తారు. గతంలో జరిగిన కార్పొరేషన్‌లో 54 డివిజన్లు వైసిపి సొంతం చేసుకుంది. మొత్తం వైసిపి నేతలే కావడంతో తాము ఏది చెబితే అదికారులు అదే చేశారు. ప్రధానంగా మార్టిగేజ్ వ్యవహారంలో ఒక్కో భవనం, అపార్ట్‌మెంట్ నుంచి రూ.10 నుంచి రూ.15 లక్షల వరకు దిగమింగేశారు. సుమారుగా రూ.15 కోట్లు కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయాన్ని కొందరి వైసిపి నేతల ప్రోత్సాహంతో అధికారులు చేశారనే తెలిస్తోంది. ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో టౌన్ ప్లానింగ్ అఫీసర్‌లు బి.ప్రవీణ్, ఎం, దేవేంద్రులు, 12, 24వ డివిజన్ సచివాలయాల్లో వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులుగా విధులు నిర్వహించిన పి. నాగేంద్ర, కె. కార్తిక్ మాలవ్యలను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఇంత పని నలుగురు కిందస్థాయి అధికారులే చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక ప్రజా ప్రతినిధి భర్త, ఆయనకు అత్యంత సన్నిహితుడు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న శివకుమార్ అనే బయట వ్యక్తి, నలుగురు, ఐదుగురు వైసిపిలో కీలకమైన కార్పొరేటర్లు ఉన్నారని ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలిసింది. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరధర్‌రెడ్డి ఇదే విషయమై కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు కాకుండా విజిలెన్స్ అధికారులకే ఈ కేసు బాధ్యతలు అప్పగించినట్లు ఎస్‌పి ఆఫీజ్ "ప్రజాశక్తి"కి తెలిపారు. విజిలెన్స్ అధికారుల విచారణలో అనేక విష యాలు బయటపడినట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ అధికారులు మొత్తం రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కేసు ఫైల్ చేసి దోషులను అరెస్ట్ చేయాల్సి ఉంటుంది. విషయం గ్రహించిన వైసిపి కార్పొరేటర్లు, కొందరు నాయకులు ఈ కేసు నుంచి ఎలా తప్పించుకోవాలనే ఆలోచనలు చేస్తున్నారు. కొందరు కార్పొరేటర్లు ఎంఎల్‌ఎ శ్రీధర్‌రెడ్డి వద్దకు వచ్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారని తెలుస్తోంది. ఇలాంటి వారిని దగ్గరకు రానివ్వనని ఇప్పటికే ఎంఎల్‌ఎ ప్రకటిం చారు. విజిలెన్స్ అధికారుల నివేదిక అనంతరం కేసు నమోదు చేసి బాధ్యులపై కేసు నమోదు చేస్తారని తెలుస్తోంది. కార్పొరేషన్‌కు రావాల్సిన నిధులు రాబడుతారా లేదా చూడాల్సి ఉంది.



మంత్రి సత్యకుమార్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-నెల్లూరు :ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను ఎన్‌జిఓ సంఘం జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌జిఒ సంఘం నాయకులు మాట్లాడు తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేసి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను పెంపొందింప చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఏ పీ ఎన్ జీ జీ ఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు,జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజు రామకష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


సత్యకుమార్‌కు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

లోకేష్‌ను కలిసిన 'ఇంటూరి'

ప్రజాశక్తి-కందుకూరు :

రాష్ట్ర మానవ వనరుల, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రిగా భాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్‌ను ఆయన చాంబర్ లో సోమ వారం కందుకూరు ఎంఎల్‌ఎ ఇం టూరి నాగేశ్వరరావు కలిశారు. నారా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.


లోకేష్‌ను కలిసిన ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు


కార్యకర్తలతో మాట్లాడుతున్న బుర్రా మధుసూదన్ యాదవ్

'బుర్రా'ను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ కందుకూరులోని పార్టీ కార్యాల యానికి వచ్చారు. వివిధ మండలాల నుంచి నుంచి వచ్చిన నాయకులు ,కార్యకర్తల యోగక్షే మాల గురించి అడిగి తెలుసు కున్నారు. ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అందరికీ భరోసా ఇస్తూ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు.

విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు పెట్టడం హర్షణీయం

ప్రజాశక్తి- కందుకూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పేద విద్యార్థులు ఉన్నతవిద్యను అభ్యసించడానికి విదేశాలకు వెళ్లే పథకానికి అంబేద్కర్ విదేశీ విద్యగా పేరుమారుస్తూ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం హర్షిం చదగ్గ నిర్ణయమని నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అంబేద్కర్ వార సులను అవమానించే విధంగా తీసుకున్న విధానాల వలనే వైసిపి 11 ఎంఎల్‌ఎ సీట్లకు పరిమితం కావలసి వచ్చిందని మోషే ఘాటుగా వ్యాఖ్యానించారు. అంబేద్కర్ పేరు విదేశీవిద్యకు పెట్టడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మోషే కతజ్ఞతలు తెలిపారు.

రూరల్ డిఎస్‌పి వీరాంజనేయ రెడ్డి బదిలీ

ప్రజాశక్తి -నెల్లూరు : రూరల్ డిఎస్‌పి వీరాంజనేయరెడ్డిని బదిలీ చేస్తూ పోలీసు అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నెల్లూరు జిల్లాకు ఆదేశాలు అందాయి. ఆయన వెంటనే జిల్లా హెడ్ క్వార్టర్ లో రిపోర్ట్ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జి డిఎస్‌పిగా ప్రస్తుతం నెల్లూరు నగర డిఎస్‌పిగా శ్రీనివాసరెడ్డికి బాధ్యతలను అప్పగించారు.

'సోమశిల' ఆనకట్ట పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు :గతంలో వచ్చిన వరదల కారణంగా దెబ్బతిన్న సోమశిల ప్రాజెక్టు 'ఆప్రాన్' నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, వరదలు సంభవిస్తే కలిగే నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి జిల్లా అధికారులు తీసుకెళ్లాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్‌లో 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఈ సమస్యను కలెక్టర్ ఎం. హరినారాయణన్‌కు వివరించి, తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరంఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య , సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్‌లు మాట్లాడుతూ గతంలో భారీగా వరదలు సంభవించిన కారణంగా వరద ప్రవాహంలో అన్నయ్య ప్రాజెక్టు కొట్టుకోని పోయిందన్నారు. ఈ కారణంగా సోమశిల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరిందన్నారు. ఆ సమయంలో పోర్లుకట్టలన్ని ధ్వంసం కావడంతో వరద నీరు గ్రామాలను చుట్టు ముట్టడంతో వేల కోట్లు విలువ చేస్తే ప్రజలు వేల కోట్ల ఆస్తులను కోల్పోయారన్నారు. ఆ సమయంలో సోమశిల ప్రాజెక్టు కు భారీ స్థాయిలో వరద నీరు చేరుకుందన్నారు. ఆ క్రమంలో నీటి ప్రవాహంలో సోమశిల ప్రాజెక్టుకు సంబంధించిన ఆప్రాన్ కొట్టుకోని పోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దెబ్బతిన్న ఆప్రాన్‌ను తిరిగి నిర్మించేందుకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పలు మార్లు వినతిపత్రం అందజేశామన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సమస్యను అర్థం చేసుకోని యుద్ధప్రాతిపదికన ఆప్రాన్ నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం సహాయ కార్యదర్శి ఓడూరు వెంకట కృష్ణయ్య ఉన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

టిఎన్ఎస్ఎఫ్ నిరసన

ప్రజాశక్తి-వెంకటాచలం

మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ్ సింహపురి యూనివర్సిటీ ఆవరణలో టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు నలబాలకు వెంకటాద్రి టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటాచలంలోని ఓ ప్రయివేట్ డిగ్రీ కళాశాలను నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని ఆరోపి ంచారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ మాట్లాడుతూ కమిటీని నియమించింది విచారణ చేసి చైతన్య బాధి డిగ్రీ కళాశాల గుర్తింపు రద్దు చేస్తామని పోలీసులు సమక్షంలో హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ నాయకులు అశోక్,సురేష్ మహేష్, సాయి, వెంకటేష్ పెంచలప్రసాద్, దివాకర్, భాను పాల్గొన్నారు.

'వేమిరెడ్డి'కి పలువురు అభినందనలు

ప్రజాశక్తి-నెల్లూరు : పార్లమెంట్ సభ్యుడిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఢిల్లీలో సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. పార్ల మెంట్‌లో ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం ముగిసిన అనంతరం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసిన డిప్యూటి మేయర్ రూప్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. వేమిరెడ్డి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి , కోవూరు ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, తనయులు అర్జున్‌రెడ్డి, కుటుంబ సభ్యులు హనీష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపి వేమిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రూప్‌కుమార్ యాదవ్

రాజ్‌నాథ్‌సింగ్‌కు శుభాకాంక్షలు

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ సోమవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రక్షణ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు రూప్ కుమార్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.

రక్తదానం చేయండి.. ప్రాణాలు కాపాడండి..

అదాని కృష్ణపట్నం పోర్టు సిఇఒ జిజె రావు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ప్రాణాపాయంలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని అదాని కృష్ణపట్నం పోర్టు సిఇఒ జీజేరావు పిలుపు నిచ్చారు. సోమవారం అదాని కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ మెగా వైద్య శిబిరం నిర్వహించింది. వైద్య శిభిరాన్ని సిఓఓ రాజన్ బాబుతో కలిసి పోర్టు సిఇఒ జిజె రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పేర్కొన్నారు. రక్తం ఎంతో విలువైనదని, డబ్బుతో కొనగలిగేది కాదని తెలిపారు. ఆరోగ్య వంతులైన ప్రతి ఒక్కరూ రక్తదాతలు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారు రక్తం దొరకక ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకొంటున్నారన్నారు. ఇబ్బందులకు గురవుతుంటారని అటు వంటి వారికి రక్తదానం చేయడం వలన వారి ప్రాణాలు కాపాడిన వారమ వుతామని తెలిపారు. అదాని కృష్ణపట్నం పోర్టు సామాజిక బాధ్యతలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ముఖ్యంగా పోర్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి రక్తదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పోర్టు ఉద్యోగులు, కార్మికులు, ఉత్సాహంగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వైద్య శిభిరంలో 283 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు రెడ్ క్రాస్ ప్రతినిధులు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, ఇహెచ్ఎస్ ఎజిఎం వేణు, గోపాల్ రెడ్డి, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కరన్, అకౌంట్స్ హెడ్ గుడి వాడ శ్రీకాంత్, అదాని ఫౌండేషన్ హె డ్ రాజేష్ రంజన్, మనీష్ దావే, ముత్యంజయరాం, గంగా సతీష్, మధు రాంబాబు, శ్రీనివాస్, పోర్టులోని వివిధ విభాగాలు హెచ్‌డిఒలు, ఉద్యోగులు, అడ్మిన్, ఇహెచ్ఎస్‌టిం ప్రతిని ధులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సిఇఒ జిజె రావు

వైసిపి కార్యకర్త మృతిపై విచారణ చేపట్టండి : బుర్రా

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు మున్సిపాలిటీకి చెందిన మూడో వార్డు ఉప్పు చెరువు నివాసి, వైసిపి కార్యకర్త ఎనుబోరు కిషోర్ మతిపై కుటుంబ సభ్యులకు ఉన్న అనుమానాలపై పోలీసు అధికారులు విచారించి వాస్తవాలను నిగ్గుతేల్చాలనికందుకూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ సోమవారం డివైఎస్‌పిని కలిసి వినతిపత్రం అందజేశారు. మృతిచెందిన ఎనుబోరి కిషోర్ వైసిపి క్రియాశీలక కార్యకర్త అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కందుకూరు 156వ బూతు చుట్టుగుంటలో ఎన్నికల ఏజెంటుగా పార్టీ కోసం పనిచేసిన వ్యక్తి తెలిపారు. ఆయన మృతిపై సమగ్ర విచారణ చేసి నిగ్గు తేల్చాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. మధుసూదన్ యాదవ్ వెంట న్యాయవాది ముప్పవరపు కిషోర్, వైసిపి నాయకులు గణేశం గంగిరెడ్డి, చీమల వెంకటరాజా, నగ్గ నారయ్య, చనమాల కోటేశ్వరరావు, తలారి ప్రసన్నకుమారి, ఎ. వసంతరావు, కుంభాల క్రాంతి కుమార్, షేక్ బికారి, జంగిలి ఇజ్రాయేలు, శ్రీరామ కుమారస్వామి, శివకష్ణ, ఎనుబోరి బాబు, గోసిపాతల నాగరాజు ఉన్నారు.

సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

కందుకూరు ఉప్పు చెరువు మూడో వార్డుకు చెందిన దళిత యువకుడు ఎనుబోరి కిషోర్ మృతిపై పై పలు అనుమానాలు ఉన్న నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు చేసి త్వరితగతిన వాస్తవాలు బయటపెట్టాలని వామపక్ష, దళిత,బహుజన, ప్రజా సంఘాలు సోమవారం డిఎస్‌సి శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశాయి. డిఎస్‌పిని కలిసినవారిలో ప్రజా సంఘాల నాయకులు బొక్క వెంకటేశ్వర్లు, పాలేటి కోటేశ్వరరావు, బి వెంకటేశ్వర్లు, న్యాయవాది ముప్పవరపు కిషోర్, సిపిఐ కార్యదర్శి బూసి సురేష్ బాబు, కార్యవర్గ సభ్యులు షేక్ హుస్సేన్, ఎస్సీ సెల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ రేణమాల అయ్యన్న, ధర్మచక్రా ఫౌండేషన్ అధ్యక్షులు గాండ్ల హరి ప్రసాదు, ఏ ఏ డి వైస్ ప్రెసిడెంట్ చనమాల కోటేశ్వరరావు, వైసీపీ నాయకులు పి పరిశుద్ధ రావు, షేక్ బికారి, పెనుబోరి బాబు, గోచిపాతల నాగరాజు, ఓంకారం ఉన్నారు.


డిఎస్‌పికి వినతిపత్రం అందజేస్తున్న బుర్రా మధుసూదన్ యాదవ్


ఎంపిగా ప్రమాణం చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

'వేమిరెడ్డి' ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్‌లో ఎంపిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన వెంట కోవూరు ఎంఎల్‌ఎ, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, ప్రశాంతిరెడ్డి కుమారుడు ఉన్నారు. ఎంపిగా బాధ్యతలు తీసుకున్న ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

శాంతి భద్రతలను కాపాడండి..

టిడిపి నేతల దాడులను అరికట్టండి - మాజీ మంత్రి 'కాకాణి'

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

" ఎస్‌పి గారు జిల్లాలో శాంతిభద్రతలు కాపాడి, టిడిపి నేతల దాడులు అరికట్టాలి" అని వైసిపి నేతలు ఎస్‌పి ఆఫీజ్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆపార్టీ జిల్లా అధ్యక్షులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిల నేతృత్యంలో ప్రతినిధి బృందం కలిశారు. వినతిపత్రం అందజేశారు. అనంతరం కాకాణి గోవర్దన్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి యుతంగా, సామరస్యంతో ఉండే నెల్లూరు జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే విధంగా తెలుగుదేశం నాయకుల ప్రవర్తన ఉంద న్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తులు దౌర్జన్యంగా వైసిపి సానుభూ తిపరులు, నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడు తున్నారు. ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని, భయభ్రాంతులకు గురిచేస్తున్నా రన్నారు. ఇటువంటి సంఘ టనల పట్ల వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్‌పికి తెలియజేశామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను అధికార యంత్రాంగం నిరోధిం చకపోతే తామే ప్రతిఘటిస్తామన్నారు. ఎస్‌పిని కలిసిన వారిలో మాజీ ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎంఎల్‌సి మేరిగ మురళీ తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌పిని కలిసి వస్తున్న వైసిపి నేతలు కాకాణి, పర్వతరెడ్డి



గిరిజనులకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం నివాసులు ప్రస్తుతం వింజమూరులో ఎ.ఎస్.ఐ.గా విధులు నిర్వహిస్తున్న ఒట్టూరు.శ్రీనివాసులు-నీరజ దంపతుల మనవడు, కొడుకు కోడలు సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా జర్మనీలో విధులు నిర్వహిస్తున్న ఒట్టూరు. నవ్యతేజ-శరణ్య దంపతుల కుమారుడైన ఒట్టూరు.లిషాన్‌రామ్ రెండవ పుట్టినరోజుసందర్భంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో సర్వాయిపాలెం గిరిజన ప్రాంతంలో ఉన్న పేదలందరికీ అన్నం వితరణ చేశారు. కార్యక్రమంలో నేటిదాతలు, దాత కుటుంబ సభ్యులు ఆత్మకూరు కల్లయ్య, చిన్న నానమ్మ ఒట్టూరు చిత్ర కల్పన, సంయుక్త సేవాసంస్థ సభ్యులు గంధం.ప్రసన్నాంజనేయులు, మల్లేశ్వరరావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు. కార్యక్రమంలో అందరూ కలిసి లిషాన్ రామ్‌కి అక్షింతలు వేసి వారి ఆశీస్సులు అందజేశారు.



మెరుగైన వైద్యమందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-బిట్రగుంట


పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య అధికారి కొర్ర చంద్రశేఖర్ పేర్కొన్నారు. చిన్న క్రాక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సహకారంతో బోగోలు మండలం పాత బిట్రగుంట గ్రామంలోని గిరిజన కాలనీలో నివసిస్తున్న సుమారు170 కుటుంబాలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆయుష్ డాక్టర్ కె చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆయుర్వేద మందులను అందజేశామని, అంటు వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలని గ్రామస్తులకు సూచించామని, తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.


మాట్లాడుతున్న నాయకులు

ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి సమావేశం

ప్రజాశక్తి-ఉదయగిరి


ఎం ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి ముఖ్య కార్యకర్తల సమావేశంను ఎంఎస్ పి జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. సోమవారం స్థానిక ఎబిఎం కాంపౌండ్‌లో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. జూలై 7వ తేదీన చలో వరంగల్ మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని అదే విధంగా ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలు ముగించుకొని మండల కమిటీలను ఎన్నుకోవాలని వాటికి తేదీలను ప్రకటించడం జరిగినదన్నారు. 28వ తేదీ ఉదయం 10 గంటలకు సీతారాంపురం మండలం మధ్యాహ్నం మూడు గంటలకు ఉదయగిరి మండలం 29వ తేదీ ఉదయం 10 గంటలకు వరికుంటపాడు మండలం మధ్యాహ్నం మూడు గంటలకు దుత్తలూరు మండలం వేయాలని ఆయన నిర్ణయించారు. కార్యక్రమంలో ఎం ఎస్ పి సీనియర్ నాయకులు గొల్లపల్లి మోహన్ రావు మాదిగ, బెజవాడ బాల గురవయ్య మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగ పట్ల, సింహాద్రి మాదిగ కె కిరణ్ మాదిగ నాయకులు బర్రె అర్జున్ మాదిగ విజయ్ మాదిగ రవి మాదిగ పాల్గొన్నారు.



విపిఆర్ ప్రమాణ స్వీకారోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రమాణ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం ఢిల్లీలోనీ లోక్ సభలో అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా మండలంలో టీడీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. ఈ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయనతో పాటు వారి సతిమణి మరియు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, ముఖ్యనేతలు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి లు పాల్గొన్నారు. తన రాజకీయ అనుభవంతో అటు ఎమ్మెల్యే గా ప్రశాంతి రెడ్డి నీ ఇటు ఎంపీ గా ప్రభాకర్ రెడ్డి విజయంలో కిలకా పాత్ర వహించిన దువ్వూరు కళ్యాణ్ రెడ్డి నీ పలువురు అభినందించారు. ప్రభాకర్ రెడ్డి వెంట కోడూరు కమలాకర్ రెడ్డి, రూప్ కుమార్ యాదవ్ ,కుటుంబ సన్నిహితులు పాల్గొన్నారు.



ఘనంగా కుంకుమార్చన

ప్రజాశక్తి-ఉదయగిరి

గంగిరెడ్డి పల్లెలో రెండవ రోజు వైభవంగా గంగాభవాని కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లిలో వెలసియున్న శ్రీ అనంతపురి గంగాభవాని ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు కుంకుమార్చన అత్యంత వైభవంగా గ్రామానికి చెందిన మహిళా భక్తులు అమ్మవారికి కాయా, కర్పూరం, కుంకుమతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు అందుకున్నారు. ఆలయ వద్ద అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం నిర్వహించిన కుంకుమ పూజా కార్యక్రమంలో భారీగా మహిళలు పాల్గొన్నారు.

మందాటిచెరువు ఆక్రమణలను తొలగించండి

ప్రజాశక్తి-కావలి

మందాటి చెరువు ఆక్రమణలను తొలగించండని రైతుసంఘం నాయకులు కనుమూరు బాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆయన నాయకత్వంలో ధర్నా నిర్వహించి, ప్రజా సమస్యల వేదిక సందర్భంగా ఆర్‌డిఒ శ్రీనానాయక్‌కు గ్రామస్తులు, ఎస్‌సి సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసునూరు ప్రాంతంలో మందాటి చెరువు వద్ద చుట్టుపక్కల వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసుకొని చెరువు పోరంబోకు భూముల్లో వందల అంగళ్ళు, బ్రాందీషాపులు ఏర్పాటు చేసుకొని చెరువు లోపల కూడా అక్రమ కట్టడాలు కడుతున్నారని తెలిపారు. చెరువులో నీరు ఉండటం వల్ల చుట్టుపక్కల గ్రామాలకు ఉపయోగపడుతున్నాయని తెఇపారు. అనంతరం దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ అలాంటి చెరువులో రియల్ ఎస్టేట్ వ్యాపారస్థులు అక్రమదారులు ఇష్టానుసారం కట్టడాలు కడుతున్నారని తెలిపారు. గతంలో వైసిపి ప్రభుత్వంలో కూడా కట్టారని తెలిపారు.


నినాదాలు చేస్తున్న నాయకులు

దానికి స్థానిక రెవెన్యూ అధికారులు సహకరించారని తెలిపారు. పెద్ద అంగళ్ళతో చెరువు బయటలోపల, చెరువులో అక్రమాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. తక్షణమే అక్రమదారుల బిల్డింగ్ పడగొట్టి చెరువును శుభ్రం చేసి 15రోజుల్లో ఇవ్వాలని ఆర్‌డిఒ కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ దానిపై 5 కమిటీలు వేసామని చెరువు భూములు పరిరక్షిస్తామని రైతులకు ఆర్‌డిఒ హామీనిచ్చారని తెలిపారు. అలాగే పాపిరెడ్డి చెరువు కూడా అక్రమాలకు గురవుతుందని తెలిపారు. పేదవారు, అక్రమించుకొంటే పర్వలేదు కానీ, పాపిరెడ్డి చెరువు పక్కన కోట్లాది రూపాయిల గల కోటీశ్వరులు, పెద్దపెద్ద బడాస్వాములు అక్రమణలు చేస్తున్నారని ఎస్ మల్లి తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఎస్ రమణయ్య, దుగ్గిరాల జార్జి, ప్రసాద్‌రెడ్డి, రమణయ్య, హరినాద్, ఇంకా అనేకమంది ధర్నాలో పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ (చేజర్ల)

ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఎంతో మంది ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ముఖ్యంగా మన చేజర్ల మండలంలోని నాగుల వెల్లటూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మంచి చదువులను అందిస్తున్నారు. అందుకనే మీ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పాఠశాల అభివృద్ధి ప్రదాత వేలూరు కేశవ చౌదరి కోరారు. స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయులు సోమవారం ఏర్పాటు చేసిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పక్క మండలాల్లోనే గ్రామాల నుండి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులతో పాటు అవస్థలు పడకుండా వీలుగా సొంత నిధులతో రెండు టాటా మ్యాజిక్ ప్యాసింజర్ వ్యాన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి సంవత్సరం మూడు లక్షల రూపాయలు వెచ్చించి విద్యా ప్రదాతగా నిలుస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించి కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిఒ 117 రద్దు చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి



గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీఓను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని ఐక్య ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లి తిరుమలాపురం అప్పసముద్రం సున్నం వారి చింతల వెంగళరావునగర్ దాసరపల్లి పాఠశాలలలో మండల ఐక్య ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల నుంచి విముక్తి కలిగించాలని 117 జీఓను వెంటనే రద్దు చేసి పాఠశాలలను బలోపేతం చేయాలని తెలిపారు. వెంగళరావు నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేత సభ్యత్వం అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎడం తిరుపతయ్య అధ్యక్షులు అనీఫ్ ప్రధాన కార్యదర్శి ఫణి రాజ్ గాజులపల్లి సుబ్బారెడ్డి, మున్నా, రామాంజనేయులు రామకృష్ణ సారధి తదితరులు పాల్గొన్నారు.


మట్టి నమూనా సేకరిస్తున్న దృశ్యం

మట్టి నమూనా సేకరణ

ప్రజాశక్తి-సీతారామపురం

భూసార పరీక్షల కోసం మట్టి నమూనా సేకరించే విధానాన్ని నెల్లూరు భూసార పరీక్ష కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు కన్నయ్య సోమవారం మండలంలోని మారంరెడ్డిపల్లి గ్రామంలోని పొలాల్లో ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. భూసార పరీక్షలు రైతులు తమ పంట పొలాల్లో చేయించుకోవడం వల్ల భూమి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని అందుకు అనుగుణంగా ఎరువులు వాడుకోవచ్చని రైతులకు తెలియచేశారు. అలాగే మట్టి నమూనా సేకరించే విధానం గురించి గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మి నారాయణ, నరేంద్ర, ఎంపిఇఒ వెంకటేశ్వర రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.



మన్నేటి వెంకటరెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మాజీ ఎఎంసి చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డికి పట్టణ జనసేన నాయకులు నాగేళ్ల రవి సోమవారం ఘనంగా సన్మానం చేశారు. ముందుగా శాలువాల పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సారథ్యంలో పట్టణంలో నెలకొన్న సమస్యలను మీ పర్యవేక్షణలో పరిష్కరించాలని కోరారు. అనంతరం మన్నేటి మాట్లాడుతూ సన్మానం చేసినందుకు జనసేన నాయకులను అభినందించారు. తెలుగుదేశం జనసేన పార్టీ నాయకులు ఐక్యమత్తంగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లవేళలా అందు బాటులో ఉంటానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకులు గాజుల బాబు అంకయ్య జనసైనికులు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండి కష్టపడి చదవాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

భవిష్యత్తులో ఉన్నత స్థానం సంపాదించాలంటే విద్యార్థి దశ నుంచే కష్టపడి చదవాలని శ్రీ వెంకటేశ్వర వైద్యశాల ఎమ్‌డి డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ పేర్కొన్నారు. సోమవారం ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తమ ట్రస్ట్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నోట్‌బుక్స్, పలకలు, బాక్సులు ఇతర విద్యా సామగ్రిని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ చౌదరి అందజేశారు. ఆత్మకూరు పట్టణం మున్సిపల్ బస్టాండ్ సమీపంలో పట్టణ తొలి పాఠశాల అయిన ఆదిఆంధ్ర పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థుల విజ్ఞప్తితో పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో తమ ట్రస్ట్ నిధులతో పాఠశాలకు ఈ పుస్తకాలను అందజేసినట్లు డాక్టర్ ప్రనీత్ చౌదరి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలకు భవిష్యత్తులో ఎటువంటి అవసరం ఉన్న తనను సంప్రదించవచ్చని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, జామెట్రీ బాక్సులు, పలకలు, పెన్నులు అందజేస్తూ వాటితో పాటు చాక్లెట్లు, బిస్కెట్స్ కూడా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణీత్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్ర నాగేంద్ర


విద్యాసామగ్రిని అందజేస్తున్న దృశ్యం

శాలువా కప్పి బొకే అందజేసి ఆయనను ఘనంగా సత్కరించారు. విశ్రాంతి ఉపాధ్యాయుడు లక్కు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆది ఆంధ్ర పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు అనేకమంది ఉన్నత స్థానాలలో ఉన్నారన్నారు. ఇక్కడున్న విద్యార్థులు కూడా ఇష్టపడి చదివి మంచి భవిష్యత్తు కోసం విద్యార్థులంతా ముందుకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వింజం.దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ అధినేత శ్రీ వెంకటేశ్వర ప్రజావైద్యశాల ఎమ్‌డి డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ చౌదరితోపాటు పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయులు లక్కు ప్రసాద్, పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర, ఉపాధ్యాయురాలు మాల కొండమ్మ, వెంకటేశ్వర వైద్యశాల డాక్టర్ కుమార్, తోడేటి అశోక్, నాగేంద్ర, పెంచలయ్య, శ్రీను, ప్రవీణ్, హేమంత్, నాని, తదితరులు హాజరయ్యారు.

పలుచోట్ల ‘ బడికి పోతా..’

ప్రజాశక్తి-మర్రిపాడు



మండలంలోని నందవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాసులు సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ఫ్లకార్డులతో పట్టుకొని గ్రామ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను బడికి పోతా కార్యక్రమం జూన్ 13వ తేదీ నుండి జూలై 12వ తేదీ వరకు జరుగుతుందన్నారు. బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విడవలూరు : మండల పరిధిలోని వావిళ్ల గ్రామం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థిని విద్యార్థులతో కలసి సోమవారం మండల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులు నేను బడికి పోతా కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు విద్యపై విద్యార్థులకు అవగాహనా కల్పిస్తూ విద్యార్థిని విద్యార్థులు ఫ్లకార్డులు పట్టుకుని విద్యకు సంబందించిన నినాదాలు చేస్తూ ,పాఠశాలనుంచి వావిళ్ల జీసీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ హెడ్ మాస్టర్ వై. చెంచురామయ్య మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఉపాధ్యాయులు బడి ఈడూ పిల్లల తల్లిదండ్రులకు విద్యపై అవగాహనా కల్పించి పాఠశాలల్లో చేర్చేలా చెర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ ఏ.వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రమాదేవి, వావిళ్ల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కె.సునీల్, సిఆర్ఎంటి కె.మురళి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బిటిఎ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టి.రవి పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అపరిష్కృతంగా ఉన్న 117 జిఒ రద్దు, సిపిఎస్ రద్దు మొదలగు సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సూచించారు. మండల అధ్యక్షులు ఎ.కిషోర్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం యథాతథంగా తీసుకురావాలని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ బహుజనుల హక్కుల కోసం పోరాడి పనిచేసే సంఘం బిటిఎ ఒక్కటే అని అన్నారు. కార్యక్రమంలో మండల బాధ్యులు సురేష్ బాబు, సత్యనారాయణ, అంచిపాక కిషోర్, పెరుమాళ్ళు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-సంగం

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రమాదేవి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పరిశీలించి సమస్యలకు పరిష్కార మార్గం చూపుతామని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో తరుణవాయి, తలుపురీరు పాడు గ్రామాల నుండి రెండు సమస్యలపై అర్జీలు వచ్చినట్లు ఆమె తెలిపారు. ప్రజలు తమ సమస్యలను సచివాలయాల ద్వారానే పరిష్కరించుకోవాలని సూచించారు. సచివాలయాల ద్వారా పరిష్కారం గానీ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ప్రజాశక్తి-విడవలూరు

తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసులకు వావిళ్ల గ్రామానికి చెందిన గ్రామస్తులు రెండు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

‘బడికి పోదాం రండి’

ప్రజాశక్తి-వరికుంటపాడు : ఎంపిడిఒ కార్యాలయంలో అన్ని పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులకు ఎంపిడిఒ తోట వెంకటకృష్ణ కుమారి 'బడికి పోదాం రండి' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అర్హులైన పిల్లలను గుర్తించి బడికి పోకుండా ఉండే పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు కానీ, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయులు కానీ ఒక టీముగా ఏర్పడి ఇంటింటికి తిరిగి బడికి పోకుండా ఉన్న పిల్లలను గుర్తించి జూలై 12వ తేదీలోపు బడిలో చేర్పించాలని సూచించారు. ఎంఇఒలు సాహుద్దీన్, రమణయ్య, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అప్రమత్తం



ఉదయగిరిలో వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-ఉదయగిరి

పంచాయతీ ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి సర్పంచ్ గొల్లపల్లి కల్పన ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి అమర్ నాథ్ రెడ్డి ఇంటింటా అవగాహన కల్పించారు. సోమవారం మండల పరిధిలోని గండిపాలెం పంచాయతీ పరిధిలో కలెక్టర్ ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు అప్రమత్త డయేరియా నిర్మూలనకు ఇంటింటా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ అవగాహన కార్యక్రమం ను రెండు బందాలుగా పంచాయతీ కార్యదర్శి జి అమరనాథ్ రెడ్డి , ఇంజనీరింగ్ అసిస్టెంట్ రవి ఏర్పడి హెల్త్ సిబ్బంది ఎఎన్ ఎం, ఆశలు గ్రామ పంచాయతీలో గ్రామం ఇంటింటా తిరిగి అవగాహన కల్పించారు.

ప్రజాశక్తి-కావలి

ప్రస్తుతం పట్టణంలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, డైయేరియా ప్రబలుతున్న కారణంతో ముందస్తుగా వ్యాధులను అరికట్టుటకు తగిన చర్యలు తీసుకోవాలని కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ కోరారు. సోమవారం సచివాలయాలకు సంబంధించి ఎ.ఎన్.ఎం.లు, ఎమినిటీస్ సెక్రటరీలు, శానిటైజేషన్ సెక్రటరీలకు కావలి పురపాలక సంఘ ప్రాంగణంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. వారికి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడడానికి, పట్టణ ప్రజలు కాచిచల్లార్చిన నీటిని తాగాలని, ప్రతి ఇంటి ఆవరణంలో నీటి నిల్వలు లేకుండా చూడాలని తెలిపారు. ప్రజలలో ఈ సీజనల్ వ్యాధులకు సంబంధించి అవగాహన కల్పించాలని కోరారు. మున్సిపల్ వాటర్‌ను ప్రతిరోజూ సంబంధిత అధికారి ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. ప్రయివేటు వాటర్ ప్లాంట్స్ నుండి వచ్చే నీటిని కూడా పరిశీలించాలని కమిషనర్ సూచనలు జారీచేశారు.


చిత్రపటాలు బహూకరణ

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఫొటో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డిపూట్యీ ముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ ఫొటో కావలి నియోజకవర్గం ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణా రెడ్డి బోగోలు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరావు, టిడిపి కార్యకర్తలు, నాయకులు తహశీల్దార్‌కు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుధీర్ బాబు, భాస్కర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


వేలం నిర్వహిస్తున్న అధికారి రాజశేఖర్

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు


మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి పలు గ్రామాలకు చెందిన రైతులు 562పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా 518 పొగాకు బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్థులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 44పొగాకు బేళ్ళను తిరస్కరించారని తెలిపారు. వీటిలో ఎన్ఎస్ 02ఎన్ బి42 ఉన్నాయన్నారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.125కాగా కనిష్ఠ ధర రూ.65, సగటు ధరరూ.87.11నమోదు కాగా, వేలంలో 06మంది కంపెనీ వ్యాపారస్థులు పాల్గొన్నారన్నారు.

ఎండియు వాహనాలు ఉండేనా.. ఊడేనా..

- ఎండియు వ్యవస్థకు అడ్డుకట్ట వేసేలా నూతన ప్రభుత్వం చర్యలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

రాష్ట్రవ్యాప్తంగా చౌక దుకాణాల నుంచి రేషన్ సరుకులను అందిస్తూ వస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పంపిణీ వ్యవస్థలో మార్పు తీసుకొచ్చింది. ప్రజల ఇంటి వద్దకే చౌక దుకాణ సరుకులను అందించేలా ఎమ్‌డియు వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ప్రజా పంపిణీ వ్యవస్థపై అధికారుల పర్యవేక్షణ పొరవడంతో ఎమ్‌డియు ఆపరేటర్లు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతుంది. ఇంటింటికి చౌకదుకాణ సరుకులు అందించాల్సిన ఎమ్‌డియు ఆపరేటర్లు వారికి ఇష్టం వచ్చిన ప్రాంతాలలో వాహనాన్ని నిలిపి అక్కడికి వచ్చే లబ్ధిదారులు సరుకులు పొందుకోవాలని లేకుంటే సరుకులు అందించమని లబ్ధిదారులతో దురుసుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. మీరు వచ్చిన సమయంలో పేదలు కూలీ పనులకు వెళ్ళుతుండడంతో ఆ సరుకులను పొందుకోలేని పరిస్థితులు ఉన్నాయి. ఇది ఎలా ఉంటే తూకాల్లో సైతం ఆపరేటర్లు మోసాలకు పాల్పడి భారీగా దోపిడీకి పాల్పడ్డారు. అదేవిధంగా లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి ఆ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎమ్‌డియు ఆపరేటర్లచే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయడంపై అప్పట్లో చౌకదుకాణ డీలర్లు రోడ్లపైకి వచ్చి



నిరసన సైతం తెలియజేసి ఉన్నారు. ఎప్పటికప్పుడు రేషన్ పంపిణీ వ్యవస్థ ఎలా జరుగుతుందన్న దానిని పర్యవేక్షించాల్సిన అధికారులు ఆ దిశగా పర్యవేక్షించకపోవడంతో ఈ వ్యవస్థ ప్రజల్లోను తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఈ క్రమంలో రాష్ట్రంలో నూతనంగా ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారం లేక రావడంతో అన్ని వ్యవస్థలో మార్పులు చేసేందుకు చకచకా ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్‌డియు ఆపరేటర్లపై వ్యతిరేకత రావడం ప్రజాపంపిణీ వ్యవస్థలో మోసాలు జరుగుతుండడంతో ఈ వ్యవస్థపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించింది. ఈ మోసాలను అరికట్టేలా చౌక దుకాణ వ్యవస్థను కొనసాగించేందుకు శ్రీకారం చుడుతున్నట్లు సమాచారం. జూలై నుంచి సౌకు దుకాణాలు వద్ద నుంచి రేషన్ సరుకులు పంపిణీ ఉంటుందని జోరుగా ప్రచారం జరుగుతుంది.